తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

● జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

నార్కట్‌పల్లి/చిట్యాల, ఫిబ్రవరి 25 : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం నార్కట్‌పల్లి, చిట్యాల మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గడం వంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇంటి పన్ను, నల్లా బిల్లులను వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ ఉమేశ్, ఎంపీఓ సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

చిట్యాలలో ఎంపీడీఓ ఎస్‌పీ జయలక్ష్మి, ఎంపీఓ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యం, ఏపీఓ శ్రీలత పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందికి సహకరించాలి

● అన్యాయం జరిగితే చట్టప్రకారం న్యాయం పొందాలి
● కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, ఫిబ్రవరి 25 : పేద ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్న నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బందికి ప్రజలు సహకరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. మంగళవారం ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి జిల్లా కేంద్ర జనరల్ ఆస్పత్రిని సందర్శించారు. మాతా శిశు సంరక్షణ విభాగంతోపాటు పలు వార్డులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ కొన్ని కేసుల విషయంలో రోగులు, వారి సహాయకులు డాక్టర్లు, సిబ్బందిని పరుష పదజాలంతో దూషిస్తున్నారని, ఇలాంటి ఘటనలు తమ దృష్టికి వస్తున్నాయని చెప్పారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, సమర్థవంతమైన డాక్టర్లు ఉండి 24 గంటలపాటు పనిచేస్తున్నారన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పనిచేసిన సిబ్బందిని ఇక్కడ నియమించామని, వీరంతా అపారమైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. కొంతమంది సంఘ వ్యతిరేక శక్తులు కొన్ని కేసుల విషయంలో డాక్టర్ల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. చట్టాన్ని ఎవరూ తమ చేతిలోకి తీసుకోవద్దన్నారు. ఆస్పత్రిలో జరుగుతున్న సంఘటనల పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, ప్రతి అంశాన్ని అతి సూక్ష్మంగా పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ కొంత మంది కావాలని డాక్టర్లను, సిబ్బందిని వేధిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలా చేయవద్దని సూచించారు. బాధితులకు అన్యాయం జరిగితే చట్టప్రకారం న్యాయం పొందాలేగానీ చట్టాన్ని తమ చేతిలోకి తీసుకొని ప్రభుత్వ అస్తులకు నష్టం చేయవద్దన్నారు. వారి వెంట డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ మాతృనాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణశ్రీ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నగేశ్, వైద్యులు ఉన్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

నల్లగొండ : వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యశాఖ అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మంగళవారం తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎండల కారణంగా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు ముందస్తుగా అవగాహన కల్పించాలన్నారు. ఉపాధిహామీ కూలీలు వడదెబ్బకు గురికాకుండా పని ప్రదేశంలో టెంట్ల ఏర్పాటు, తాగునీటి సరఫరా, ఓఆర్ఎస్ ద్రావణం వంటి వాటిని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ వేణుగోపాల్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి ఎమ్మెల్సీ కోటిరెడ్డి పరామర్శ

సయ్యద్ హుస్సేన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నిడమనూరు, ఫిబ్రవరి 25 : మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు షేక్ సలీం పాషా తండ్రి సయ్యద్ హుస్సేన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మంగళవారం ముకుందాపురం గ్రామానికి వెళ్లి హుస్సేన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కేశ శంకర్, మాజీ ఎంపీటీసీ మంజులా శ్రీను, బీఆర్ఎస్ నాయకులు నారెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, రాం నాగరాజు, సలికంటి అంజయ్య, రాం ఉపేందర్, శ్రీకాంత్, షేక్ హజరత్, షేక్ వలీ ఉన్నారు.

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌ను కలిసిన వస్రాంనాయక్

గవర్నర్‌ను కలిసిన క్రికెటర్ వస్రాంనాయక్

త్రిపురారం, ఫిబ్రవరి 25 : ఇండియన్ దివ్యాంగుల క్రికెట్ టీంకు ఎంపికైన మండలంలోని మాటూరు గ్రామానికి చెందిన ధనావత్ వస్రాంనాయక్ మంగళవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాద పూర్వకంగా కలిశారు. దివ్యాంగులు మానసికంగా కుంగి పోకుండా పట్టుదలతో ఎదుగాలని, తోటి వారికి కూడా ప్రోత్సాహం అందించాలని గవర్నర్ తమకు సూచించినట్లు వస్రాంనాయక్ తెలిపారు. బాగా ఆడి దేశానికి పతకాలతోపాటు మంచి పేరు తీసుకురావాలని గవర్నర్ సూచించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆడపిల్లలు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదుగాలి

● జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

సదస్సులో మాట్లాడుతున్న కృష్ణవేణి

నకిరేకల్, ఫిబ్రవరి 25 : ఆడపిల్లలు చదువుపైనే దృష్టి కేంద్రీకరించి ఉన్నత స్థాయికి ఎదుగాలని, యుక్తవయస్సులో ఇతర అంశాలపట్ల ఆకర్షణలకు లోనుకావద్దని జిల్లా శిశు సంక్షేమ, వయోవృద్ధుల శాఖ అధికారి కృష్ణవేణి సూచించారు. నకిరేకల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన బేటీ బచావో-బేటీ పడావో క్యార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు జరిగినట్లయితే 1098 నంబర్‌కు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గుడ్ యూనివర్సల్ నీలోఫర్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో బాలికలకు యుక్త వయస్సులో వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ నాగయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, మెడికల్ ఆఫీసర్ యోగస్విరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ వైష్ణవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సునీత, అంజమ్మ, పద్మావతి, సరిత, కళావతి, శారద, భవాని పాల్గొన్నారు.

దేవరకొండ నుంచి శ్రీశైలం క్షేత్రానికి ప్రత్యేక బస్సులు

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 25 : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవరకొండ ఆర్టీసీ డిపో నుంచి శ్రీశైలం క్షేత్రానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు దేవరకొండ డిపో మేనేజర్ తల్లాల రమేశ్‌బాబు తెలిపారు. మంగళవారం బస్సు సర్వీసును ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 27వ తేదీ వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని, ఇందులో పెద్దలకు రూ.400, పిల్లలకు రూ.210 చార్జీలు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

మర్రిగూడ, ఫిబ్రవరి 25 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని లెంకలపల్లి, దామెర భీమనపల్లి గ్రామాల్లో స్థానికులకు సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించారు. బహుమతులు, లోన్లు, లాటరీల పేరుతో వచ్చే లింక్ మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

నాయకునితండా వాసికి ఉస్మానియా డాక్టరేట్

డాక్టరేట్ అందుకుంటున్న భానునాయక్

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 25: మండలంలోని నాయకునితండాకు చెందిన మెరావత్ భానునాయక్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఫిజికల్ సైన్స్‌లో పీహెచ్‌డీ పట్టా పొందాడు. 'సింథసిస్ క్యారెక్టరైజేషన్ మ్యాగ్నెటిక్ అండ్ ఎలక్ట్రికల్ ప్రాపర్టీస్ ఆఫ్ లాంథనం డోప్డ్ కోబాల్ట్, ఎర్బియం-డోప్డ్ మెగ్నీషియం కాపర్, హోల్మియం-డోప్డ్, మెగ్నీషియం కాపర్ నానో ఫెర్రైట్స్‌లో టెంపరేచర్ సిట్రేట్ సోల్ జెల్ ఆటో కంబుషన్ మెథడ్' అంశంపై చేసిన పరిశోధనకుగాను ఉస్మానియా యూనివర్సిటీ భానునాయక్‌కు డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది. డాక్టరేట్ అందుకున్న భానునాయక్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు : తాసీల్దార్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 25: ఈ నెల 27న జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టణంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తాసీల్దార్ హరిబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, బకల్‌వాడీ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సీఐ నాగార్జునతో కలిసి సందర్శించారు. పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తుతోపాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

భూ నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

● దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్

భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), ఫిబ్రవరి 25 : నక్కలగండి ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న చందంపేట మండలం తెల్దేవర్‌పల్లి గ్రామానికి చెందిన భూ నిర్వాసితుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. తెల్దేవర్‌పల్లి గ్రామానికి చెందిన నిర్వాసితులు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మాజీ జడ్పీటీసీ బుజ్జి లచ్చిరాంనాయక్, మాజీ ఎంపీపీ బిక్కునాయక్, సుక్కునాయక్, హరికృష్ణ, భరత్, మహాలక్ష్మి ఉన్నారు.

విద్యార్థినులతో కలిసి నేలపై కూర్చున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

బాలికలు చదువులో రాణించి ఉన్నతంగా ఎదుగాలి

● ఎస్పీ శరత్‌చంద్ర పవార్

రామగిరి, ఫిబ్రవరి 25: సమాజాన్ని మార్చగల శక్తి విద్యకు ఉందని, బాలికలు బాగా చదివి ఉన్నత స్థానానికి ఎదుగాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. నల్లగొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎవ్వరూ కూడా ధైర్యం కోల్పోకుండా చదువునే నమ్ముకొని చక్కగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఎస్పీ విద్యార్థుల మధ్యలోకి వెళ్లి నేలపై కూర్చుని సెల్ఫీ దిగారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, డీఐఈఓ దస్రూనాయక్, ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాసవీ కపుల్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

వాసవీ కపుల్స్ క్లబ్ కార్యవర్గం

నకిరేకల్, ఫిబ్రవరి 25 : వాసవీ కపుల్స్ క్లబ్ కొత్త కార్యవర్గాన్ని మంగళవారం నకిరేకల్ పట్టణంలోని క్లబ్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తేలుకుంట్ల రాజుశోభారాణి, ఉపాధ్యక్షులుగా కందగట్ల బాలాజీ శ్వేత, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాకుళ వెంకన్నహైమావతి, కోశాధికారిగా బ్రహ్మదేవర వేణుస్వప్న ఎన్నికైనట్లు చార్టెడ్ ప్రెసిడెంట్ గుండా గోపి తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దేవరశెట్టి సత్యనారాయణ, జోన్ చైర్మన్ గుండా నరేందర్, కోశాధికారులు వీరవెల్లి రఘునాథ్, బచ్చు శ్రీనివాస్, సభ్యులు ఉప్పల సంతోశ్‌కుమార్, పారేపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఫిబ్రవరి 25 : స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, స్టార్ ఆస్పత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేశ్, మిర్యాలగూడ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, కంచర్ల అనంతరెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 25: మార్చి 20న జరిగే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం బీసీలకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 20న ఐదు ఎమ్మెల్సీల పదవీకాలం ముగుస్తున్నందున కాంగ్రెస్ పార్టీకి నాలుగు ఎమ్మెల్సీలు దక్కే అవకాశం ఉందని, జనాభా ప్రాతిపదికన బీసీలకు రెండు స్థానాలు కేటాయించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, ఎర్రబెల్లి దుర్గయ్య, దోనేటి శేఖర్, కుమ్మరికుంట్ల సుధాకర్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ఎయిడ్స్ నివారణ

● ఎంజీయూలో ముగిసిన హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు

విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందిస్తున్న ఓఎస్‌డీ అంజిరెడ్డి, డాక్టర్ సుచరిత

రామగిరి, ఫిబ్రవరి 25: అప్రమత్తత, అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యమని వైద్యురాలు డాక్టర్ సుచరిత, తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ భిక్షపతిరావు సూచించారు. నల్లగొండలోని ఎంజీయూలో మంగళవారం నిర్వహించిన హెచ్‌ఐవీపై అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. హెచ్‌ఐవీ లైంగిక హింసపై విద్యార్థులతో చర్చించారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో రెండు రోజుల సదస్సులో పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఎంజీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.మద్దిలేటి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంజీయూ ఓఎస్‌డీ కొప్పుల అంజిరెడ్డి, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా కొరతతో రైతులు సతమతం

● ఉమ్మడి రాష్ట్ర పాలనను గుర్తు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
● రైతుబంధు సమితి మండల మాజీ కన్వీనర్ రామకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

మర్రిగూడ, ఫిబ్రవరి 25 : రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఉమ్మడి రాష్ట్ర పాలనను గుర్తు చేస్తుందని రైతు బంధు సమితి మండల మాజీ కన్వీనర్ బచ్చు రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఉనికే కనిపించడం లేదని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని, బీఆర్ఎస్ పార్టీ లేక పోతే అసలు తెలంగాణ రాష్ట్రం వచ్చేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేరు పలుకకుంటే రేవంత్‌రెడ్డికి పొద్దే పోదన్నారు. రైతు భరోసా, రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో అన్నదాతలు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు బీఆర్ఎస్ పార్టీపై బురద జల్లడం మాని, పాలనపై దృష్టి పెట్టి ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మారగోని వెంకటయ్య యాదవ్, గ్రామశాఖ అధ్యక్షుడు రాపోలు యాదగిరి, నాయకులు చెర్కు శ్రీరామ్ గౌడ్, గంట రవి, రావిరాల మనోహర్, మాద సత్తయ్య, ప్రకాశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన బియ్యాన్ని వినియోగించాలి

ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

మర్రిగూడ, ఫిబ్రవరి 25 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే ముందు బియ్యాన్ని పరిశీలించాలని, నాణ్యమైన బియ్యాన్ని మాత్రమే వినియోగించాలని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని యరగండ్లపల్లి జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి వంటకు ఉపయోగించే బియ్యాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మండలకేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. డీలర్లు సిలిండర్ల సరఫరాలో జాప్యం చేయవద్దని, సిలిండర్ డెలివరీ సమయంలో అదనపు చార్జీలు తీసుకోవద్దని సూచించారు.

సంపత్ కుటుంబాన్ని పరామర్శించిన నల్లమోతు సిద్ధార్థ

మిర్యాలగూడ, ఫిబ్రవరి 25 : పట్టణంలోని వినోభానగర్‌కు చెందిన కోడిరెక్క సంపత్(35) సోమవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ మంగళవారం వారి ఇంటికి వెళ్లి సంపత్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట బీఆర్ఎస్ యువజన విభాగం పట్టణాధ్యక్షుడు యర్రమళ్ల దినేశ్, నాయకులు యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, బల్లెం అయోధ్య, శిరసనగండ్ల ఈశ్వర్‌చారి, వింజం శ్రీధర్, పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఎండీ.షోయబ్, చార్లి, చిన్నప్ప, అశోక్, శివరాం, అమర్‌నాథ్, మహేశ్‌గౌడ్ ఉన్నారు.

వేములపల్లి : మండలంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నక్క నాగరాజు తల్లి ఎల్లమ్మ(75) మంగళవారం మృతిచెందారు. బీఆర్ఎస్ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ వారి ఇంటికి వెళ్లి ఎల్లమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

స్వాన్ సేవలు విస్తృతం చేయాలి : ఎంఈఓ నర్సింహ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ కూకుట్ల నర్సింహ

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 25 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం పూర్వ విద్యార్థుల సంస్థ(స్వాన్) సేవలు విస్తృతం చేయాలని ఎంఈఓ కూకుట్ల నర్సింహ సూచించారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన స్వాన్ టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో సాంస్కృతిక సారథి సభ్యురాలు వేముల పుష్పతో కలిసి ఆయన బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులకు ఇంపాక్ట్ మోటివేషన్ స్పీకర్ నూనె సుదర్శన్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్యయాదవ్, మాజీ సర్పంచ్ దూదిమెట్ల స్రవంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు, స్వాన్ సభ్యులు పాల్గొన్నారు.

భార్యను చంపి భర్త ఆత్మహత్యాయత్నం

● కుటుంబ కలహాలే కారణం

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 25 : కుటుంబ కలహాలతో భార్యను కిరాతకంగా హత్య చేసిన వ్యక్తి.. ఆ తర్వాత పురుగుల మందు తాగి తానూ ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని పెద్దగుమ్మడంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద గుమ్మడం గ్రామానికి చెందిన కోట్ర పెద్దయ్య వివాహం లక్ష్మమ్మతో 20 సంవత్సరాల క్రితం జరిగింది. వారికి కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తరచూ కుటుంబ కలహాలు చోటు చేసుకుంటున్నాయి. సోమవారం రాత్రి భార్యాభర్తల గొడవ జరుగగా.. ఆవేశానికి గురైన పెద్దయ్య గొడ్డలితో లక్ష్మమ్మపై దాడి చేశాడు. దాంతో తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆపై పెద్దయ్య కూడా పురుగుల మందు తాగాడు. ఈ గొడవకు కుమారుడు పవన్ నిద్రలేచి చూసే సరికి తల్లి మృతి చెంది ఉండగా.. తండ్రి పురుగుల మందు తాగి ఇబ్బందులు పడుతున్నాడు. దాంతో అతను స్థానికుల సాయంతో పెద్దయ్యను దేవరకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కుమారుడు పవన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

వధువు కావలెను

ఆర్య వైశ్య అబ్బాయి 1989, M.Ed. పార్ట్ టైమ్ లెక్చరర్, వ్యవసాయం, 14x2=28 వేలు, ఆస్థి 70 లక్షలు, నల్లగొండ, వీరయ్య 9121325068, కోమట్ల అమ్మాయి కావలెను 1వ, M9HB, మునుగోడు రోడ్డు.

NLG-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

పీడీఎస్ బియ్యం పట్టివేత

● మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్

నందికొండ, ఫిబ్రవరి 25 : తెలంగాణ నుంచి ఆంధ్రాకు రవాణా చేస్తున్న 80 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని నాగార్జునసాగర్‌లోని సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద సోమవారం పట్టుకున్నట్లు డీఎస్పీ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం మిర్యాలగూడంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలోని కొత్త వంతెన వద్ద విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్‌గౌడ్ వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఐచర్ వాహనాన్ని నిలిపి తనిఖీ నిర్వహించారు. పోలీసులను చూసి అందులో ఉన్న వ్యక్తి దూకి పారిపోగా వాహనం డ్రైవర్ బ్రహ్మంరాజు, ఆంధ్రా వ్యాపారి వెంకటేశ్వర్లు, చిల్కాపురం రేషన్ డీలర్ నరసింహను అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సోదా చేయగా పీడీఎస్ బియ్యం బస్తాలు ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. తిరుమలగిరి సాగర్ మండలం చిల్కాపురానికి చెందిన మనమాల నరసింహ, గరిక తండాకు చెందిన సపావత్ విజయ్ రేషన్ డీలర్లు. అధిక లాభాలకు ఆశపడి రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించారు. నాయకుని తండాకు చెందిన దేవుజనాయక్, నాగరాజు ద్వారా ఆంధ్రా ప్రాంతానికి చెందిన బియ్యం వ్యాపారులైన తిరువాయిపాటి వెంకటేశ్వర్లు, శెట్టిపల్లి వెంకటేశ్వర్లుకు బియ్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వీరంతా కలిసి కొంత కాలంగా ఆంధ్రాకు పీడీఎస్ బియ్యం వ్యాపారం కొనసాగిస్తున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. బియ్యం వ్యాపారులను పట్టుకున్న సాగర్ సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్ గౌడ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఎర్రబెల్లి క్వారీ ఎదుట ఆందోళన

● వెంకన్న కుటుంబానికి న్యాయం చేయాలని గేటుకు తాళం

ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎస్ఐ

నిడమనూరు, ఫిబ్రవరి 25 : మండలంలోని ఎర్రబెల్లి సిలికాన్ క్వారీ వద్ద గత నెలలో అనుమానాస్పదంగా మృతి చెందిన బిల్లకంటి వెంకన్నది హత్యే అని, అతడిని హత్య చేసి చెట్టుకు ఉరేశారని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంటువారిగూడెం గ్రామస్తులు మంగళవారం ఉదయం క్వారీ ఎదుట ఆందోళన చేపట్టారు. బంటువారిగూడెం గ్రామానికి చెందిన వెంకన్న (55) జనవరి 21న క్వారీ ముందు భాగంలో చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. 22న ఉదయం గమనించిన క్వారీ సిబ్బంది పోలీసులకు సమాచారమందించారు. మృతదేహంపై గాయాలుండటంతో ఆయన కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. వెంకన్న మృతి చెంది నెల రోజులైనా కేసు దర్యాప్తులో పురోగతి లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బంటువారిగూడెం గ్రామస్తులు, మృతుడి కుటుంబ సభ్యులు క్వారీ వద్దకు చేరుకుని సిబ్బందిని బయటకు పంపారు. కార్యాలయానికి తాళం వేసి గేటు ముందు కంప వేసి ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న ఎస్ఐ గోపాల్‌రావు సిబ్బందితో కలిసి క్వారీ వద్దకు చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి కేసు దర్యాప్తులో ఉన్నట్లు చెప్పినా వారు వినకుండా ఆందోళన కొనసాగించారు. సీసీ పుటేజీలో క్వారీ ముందు భాగంలో అపరిచిత వ్యక్తి కదలికలున్నాయని, మొదట తమ సిబ్బంది అని చెప్పిన యజమాని రాజేందర్‌రెడ్డి తర్వాత అతనెవరో తెలియదంటున్నాడని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయమై పోలీసులు నిజాలు నిగ్గు తేల్చి దోషులను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎస్ఐ గోపాల్‌రావు వివరణనిస్తూ మృతుడు వెంకన్న కాలిపై గాయాలున్నందున అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలు రాగానే దర్యాప్తు వేగవంతం చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. ఆందోళనలో మాజీ సర్పంచ్ గుండెబోయిన రాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మెరుగు రామలింగయ్య, బిల్లకంటి కృష్ణ, బిల్లకంటి మట్టయ్య, అంజయ్య, కోదండ చరణ్‌రాజ్ పాల్గొన్నారు.